# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. | సంచిక ౩.

15 1921

కాకినాడ:—శనివారము, ౧౫, జనవరి, ౧౯౨౧.

చందా సం॥ రు ౩. | విడిసంచిక అ ౧.

## ఓమ్.

శా. దేవా! నీచరణప్రసాదకణలబ్ధిం గాక లేకున్న నొం
డేవెంటం జను నీమహామహిమ నూహింపంగ నెవ్వారికిన్?
నీవారై చనువారిలో నొకఁడనై నిన్ గొల్చుభాగ్యంబు నా
కీవే యెప్పటికైన నన్నుఁ గరుణన్ వీక్షించి విశ్వేశ్వరా!

చ. అరయఁగ భక్తపాలనము లైనభవద్గుణజాల మాత్మ సం
స్మరణము సేయ, వాక్కు నిను సన్నుతి సేయ, శరీర మెల్లఁ గిం
కరపరివృత్తి సేయ మదిఁ గాంక్ష యొనర్చెదఁ నంతె కాని నా
కరుదుగఁ జక్రవర్తిపద మైన నొసంగిన నొల్ల నీశ్వరా!

తే. భక్తజనసంతతానంద భద్రకరము
భూరిసంసారసాగరోత్తారణంబు
నవ్యయానంద మోక్షదాయకము నైన
నీపదధ్యాన మాత్మలో నిలువ నీవె!

(భాగవతము.)

---

అగ్నిజ్వాలలయందుఁ దగులుకొని చచ్చిపోవుదు నని యెఱుంగక పతంగము దీపాగ్నియందుఁ బ్రవేశించుచున్నది. ఎరవు వేసిన మాంసమును మ్రింగినయెడల గాలము గ్రుచ్చుకొను నని తెలియక మత్స్యము మాంసమును మ్రింగుచున్నది. కాని భోగవిషయములు విపత్పూర్ణము లనియును, భోగముల ననుభవించుటకుఁ బ్రయత్నించిన సర్వనాశ మగు ననియును, దెలిసియుండియు వీనిని మనము పరిత్యజించుట లేదు. అయ్యో! మోహమున కెట్టి భయంకరమగుశక్తి గలదు! ఇంద్రియసుఖములకొఱకుఁ గాను, విషయభోగము లనుభవించుటవలన, మనయవస్థ యేవిధముగ నయ్యెనో విచారించి చూచుకొనుఁడు. ఎట్టియుత్కృష్టజన్మ మెత్తి యెట్టి యవస్థయందు పడియున్నాము? ఈదురవస్థను దాఁటుట కుపాయ మెద్ది? ఇంద్రియసేవవలన మనకు సర్వనాశము సంభవించినది గదా?

(భక్తియోగము.)

---

"పురాతన జగన్నిర్వాణమయ్యెను, మహాప్రళయ ముపస్థితమయ్యెను; సముదయమును ఘనాంధకారము; తిమిరావ్యాప్తము; ఇప్పుడొక నూతనజగత్తు సృష్టమగును. ప్రళయమూపమగు నంధకారసాగరము నుండి నవబ్రహ్మాండము సృష్టింపబడును; నవసూర్యుఁడుదయించును. ఆ జలములోనే సముదయమున్నది; ఉద్భావితమగును. ఘోరాంధకారసాగరములో క్షుద్రనౌకారోహియగు జీవాత్మ - సాధకుడు - తేలుచున్నాడు. కాని ఘోరాంధకారమగు రాత్రి తరువాత సుప్రకాశమైనట్లుగనే యోగజీవనమునందు గ్రమక్రమముగ బ్రహ్మము ప్రకాశమగును. ప్రథమమున నుషస్సును తరువాత ప్రాతఃకాలమును, పిమ్మట ద్విప్రహరాలోకమును నుపస్థితములగును. ఈయంధకారములోపల నీశ్వరుని నాహ్వానము జేయవలయును. ఓయీశ్వరా, ఓయీశ్వరా, ఓయీశ్వరా యని క్రమాగతముగ నాయనను బిలువవలయును. ఒకమూల బిలుచుచుండగనే, యింకొకమూల నంధకారసాగరతరంగములు గ్రసించుచున్నవి. పైన నంధకారాకాశము; క్రింద నంధకారసాగరము. ఆహ్వానము జేయుచుంటివి; ఆహ్వానించుచుండగనే, 'నేనున్నా' నను నొక గంభీరశబ్దమును వింటివి."

(కేశవచంద్రసేను.)

---

"ఈశ్వరుడొక్కఁడే మనకు సహాయుడును, ఆశ్రయుడును. మనయొక్క మనస్సు ఎల్లప్పుడును ఆయనయందే కట్టుబడియుండవలెను."

"మానవుల యొక్క మనస్సు స్వాభావికముగా బాపము వైపుల బోగోరును. మహాత్ముల యొక్క ఉపదేశముల ద్వారా, ఈమనస్సును అట్టి పాపమార్గముల నుండి మఱలునట్లు చేయవలయును."

"విశ్వాసమును త్యజించుట కంటె మృత్యువే మేలు."

(తేగ్ బహదూర్.)

---

# మహర్షి దీక్షా దినము.

—:o:—

[శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారు.]

ఒక దినము, పుష్యసప్తమి, యెవ్వని యొక్క చేతనత్వము విలాసార్థమశయ్యనుండి మేల్కొల్పబడెనో ఆ శ్రీమన్మహర్షి దేవేంద్రనాథ బ్రహ్మధర్మమునందు దీక్ష స్వీకరించిన దినము. రత్నమును దానముచేసినట్లుగా మనకాయన యీదినమును దానముచేసి వెళ్ళినారు. ఆదినమును ఈ ఆశ్రమము అనెడి పెట్టెయందు మనకొరకై దాచియుంచి వెళ్ళినారు. నేడా పెట్టె నుద్ఘాటనముచేసి యీ రత్నమును ఈ ప్రాంతమున నీలాకాశమునందు, ఇచ్చటి ధూళివిహీనమైన నిర్మల నిభృతాకాశమునందు, దేదీప్యమానముగా వెలుంగుచున్న నక్షత్రమండలి యొక్క మధ్యభాగమునందెత్తి చూచెదము. ఆసాధకుని జీవనముయొక్క పుష్యసప్తమి, నేడుద్ఘాటనము చేసెడి దినము. దానితోపాటు నేడు మనమిచ్చట నుత్సవము ఏర్పాటుచేసెదము. ఈ పుష్యసప్తమినాడు ఆసాధకుడు దీక్షతీసికొనిన దినము. ఆదీక్ష యెంతవిలువగలదో యీదినము మనకామాట చెప్పుచున్నదిగదా? ఆమాట వినకపోయినచో మాకెందుకు మనమిచ్చటికి వచ్చిచేరితిమి, ఇక్కడనుండి మరేమితీసికొనిపోయెదము? ఆయన జీవితమునందొకనాడు పుష్యసప్తమి యొక్క సూర్యుడుదయించెను. ఆ దినము దీపమా వెలుగలేదు, జనసమాగముకూడ కాలేదు. ఆశీతకాలమునందా దినము శాంతముగా నుండెను. స్తబ్ధముగా యుండెను. ఆదినమేమి సంభవించెనో ఆయనకుకూడ తెలిసినదికాదు. అంతర్యామి యగు విధాతమాత్రమే యెరుగును. ఆయన దీక్ష స్వీకరించిన ఆదినము సామాన్యమైనదికాదు, అది శాంతిదీక్షకాదు, అగ్నిదీక్ష. ఆదీక్ష మిథ్యాకర్మలతోగాని, అసత్యాచరణములతోగాని, అమంగళవ్రతములతోగాని నిండియుండలేదు. నేడు నీవు నాహస్తమునుండి స్వీకరించుచున్నటువంటి యీవస్తువు యథార్థమైనది, నిర్మలమైనది, నిష్కళంకమైనది, యీసత్యముయొక్క భారము నీవు స్వీకరించుచున్నావు. కనుక నీకింక ఆరామములేదు, విరామములేదు, అహోరాత్రములు జాగ్రదావస్థయందేయుండవలె యును, ఈ సత్యమును పాలించుటలో నీసంపత్తి యంతయు పోయినను పోవుగాక, నీయశశ్చంద్రికలు మ్లానమయినను మ్లానమగుగాక, నీజీవితమునకు సహా ముప్పువాటిల్లినను వాటిల్లుగాక? జాగ్రత! నీహస్తమునందు నా సత్యమున కపమానము సంభవించకుండునుగాక! యని ఆయన ప్రభువు ఆయనను జాగ్రతపరచియుండెను. ఆయన ప్రభువువద్దనుండి యీసత్యదానమును స్వీకరించినతరువాత ఆయన నిద్రించలేకపోయెను, ఆత్మీయులు దూరముగా తొలగిరి, యిళ్ళవాకిళ్ళాయనకు సెలవిచ్చెను, సంఘమాయనను బహిష్కరించెను, నిందాప్రవాహమునందు దేశమంతయు నిండిపోయెను, అంత పెద్దబ్రహ్మాండమయిన సంసారము, అంతమంది గౌరవముగల ఆత్మీయులు, ధనముగల ఆత్మీయులు, నలువైపులనుండివచ్చెడి అట్టి మహాసహాయము, అన్నిటితో విచ్ఛేదము వాటిల్లెను, ఇట్టి దీక్షను ఆయన స్వీకరించెను. జగత్తునందు సమస్త అనుకూల్యములకు విముఖుడై ఆసత్యమును స్వీకరించి దేశదేశమునందును, అరణ్యపర్వతములందును, సంచరించెను. ఇది ప్రభువు యొక్క సత్యము. ఈ అగ్నిని రక్షించెడిభారము వహించినతరువాత ఆరామములేదు, నిద్రలేదు; ఎవడైతే భయానాంభయం, భీషణానాంభీషణమో అట్టి ఆ రుద్రదేవునివద్ద స్వీకరించిన ఆ అగ్నిదీక్షయొక్క యథార్థమైన వజ్రమూర్తియే నేడీమహోత్సవము గా పరిణమించినది. గురువుయొక్క హస్తమునుండి ఆ 'వజ్రముద్యతం' ను స్వీకరించెను. అట్టి మహావిలాసమునందు మగ్నమయియున్న ధనికునిపుత్రునకు సంభవించిన సంకటదినమును గురించి అందరెరిగినవిషయమే. అట్టి విపులైశ్వర్యముతో నిండియుండిన రాజప్రాసాదమునందు నిర్భయముగా ఆరామశయ్యపైబడి నిద్రించుచున్న సమయమున అకస్మాత్తుగా ఆయన తలపై విరిగిపడి ఆయనను మట్టిలో కలిపివేయుటకు ప్రయత్నించుచున్న భయంకరమైన విపదావస్థయందు ఆసత్యదీక్షయే ఆయనను రక్షించెను. ఆదినమునందాయనకెట్టి పార్థివసహాయమును అక్కరాలేదు. ఈదీక్ష కేవలము దుర్దినముయొక్క దారుణాఘాతములనుండే రక్షించలేదు. ప్రలోభనములయొక్క భయంకరాక్రమణలనుండి కూడ రక్షించెను. నేడీ పుష్యసప్తమి దినమున ఆయనయొక్క ఆసత్యదీక్షయొక్క రుద్రదీప్తి దేదీప్యమానముగా వెలుగుచుండుటను, పిరికిచేత గాని, భయముచేతగాని, సంకోచముచేతగాని తొట్రుపాటుపడక చూడగలిగినను, లేశమాత్రమయినను స్వీకరింపగలిగినను, సత్యముయొక్క దీక్షయం దేనినందురో దానిని నేడు భక్తితో స్మరింపగలిగినను, మనము కూడ ధన్యులము కాగలుగుదుము. దీనిలో లేశమాత్రమయినను మోసములేదు, దాగుడుమూతలాటలేదు, తనను మరపించెడి సునిపుణమిథ్యాయుక్తియూ లేదు, సం

ఘమును ప్రసన్నపరచుటకై బుద్ధియొక్క రెండుకండ్లను మూసివేయుటలేదు, మానవ బజారునందు విక్రయించుటకై భగవానుని ధనమును దొంగిలించుటకూడకాదు. ఆ సత్యవ్రతము ను సమస్త దుఃఖములలోను, పీడనములలోను స్వీకరించగలిగినచో మనకింక భయములేదు. ధూళితో నిర్మింపబడిన గృహమును బడగొట్టి పితృభవనమునకు సంపూర్ణమైన అధికారము గలవారమగుదుము, చిరజీవనమునకు గమ్యస్థానమయినటువంటి ఆ ఆనందామృత నికేతనము యొక్క మార్గమునకు ఏ ఒక్కడైతే బంధువో అతని ఆశ్రయము ను పొందుటయే సత్యదీక్షయొక్క యథార్థమైన తాత్పర్యము.

ఆ సాధకుడు అతని జీవనమునందన్నిటికంటె మహత్తయినటువంటి ఆయన దీక్షాదినమును యీనిర్జన ప్రాంతముయొక్క ముక్తాకాశమునందును, నిర్మలాలోకమునందును ప్రతిష్ఠించి యుంచి వెళ్ళెను. ఆయనయొక్క ఆమహాపుణ్యదినము నాశ్రయించి, యీమందిరమును, యీఆశ్రమమును, యీవిద్యాలయమును, ప్రతిదినము ప్రవర్ధమానములగుచున్నయవి. మనజీవనము, మనహృదయము, మనచేతనత్వము దీని నాశ్రయించి నిలబడియున్నయవి. ఈదినముయొక్క ఆహ్వానమునంగీకరించి యేకల్యాణమూర్తి యిచ్చట ఆవిర్భూతమయినదో, ఆయన సత్యదీక్షయొక్క దినము ధనికులను, దరిద్రులను, బాలకులను వృద్ధులను, జ్ఞానులను మూర్ఖులను, ప్రతివత్సరము ఈ ఆనందోత్సవమునకు ఆహ్వానముచేయుచున్నయది. ఈదినమును అశ్రద్ధతో జీవనద్వారప్రాంతమున నిలువబెట్టి యుంచకుందుముగాక! దీనిని భక్తితో, ఆదరముతో లోపలకాహ్వానించి సన్మానించుము, మన ప్రతిదినతుచ్ఛజీవనముయొక్క దైన్యమును సంపదతో నింపివేయుదము.

హే దీక్షాదాతా! హే గురు! ఇప్పటికిని సిద్ధముగా నుండకపోయితిమేని సిద్ధముచేయుము. చేతనత్వమును సర్వత్ర నుద్వ్యక్తముచేయుము, దుర్బలులమని వెళ్ళగొట్టకుము, వెళ్ళగొట్టకుము. నీ సభాసదుల వెనుకకు నెట్టివేయకుము. ఈజీవనమునందు సత్యమును నిర్భయముగను, నిస్సంకోచముగను స్వీకరింపక తప్పదు. అసత్యము యొక్క స్తూపాకారావర్జనమునందు వ్యర్థజీవనమును త్రోసివేయకుము. సత్యదీక్ష స్వీకరించ~~వలెను~~. నీవు శక్తినిమ్ము?

ఆ॥ చ॥

---

# బ్రాహ్మసమాజము.

:o:

## బెజవాడ యువతీజన ప్రార్థన సమాజము.

ఈసమాజము యొక్క తృతీయ వార్షికోత్సవము యీదిగువ కనుపరచిన కార్యక్రమము చొప్పున శ్రీ సర్కిలు యిన్స్పెక్టరుగారు నివసించియుండు మేడయుందలి ఆవరణములో వేయబడినట్టియు „ బ్రహ్మకృపాహి కేవలం ” „ ఏకమేవాద్వితీయం ” అను పటములచే నలంకరింపబడినట్టియు పందిరిలో శ్రీమతి జ్ఞానమాంబగారి అధ్యక్షత క్రింద జరుపబడెను.

1-1-21 శనివారము—మధ్యాహ్నము 12 ఘంటలు మొదలు 3 ఘంటలవరకు నిరుపేదల కన్నదాన మొసంగబడెను.

3 ఘం॥ మొదలు 6 ఘం॥ వరకు బ్రహ్మప్రచారకులగు శ్రీయుత పాలపర్తి నరసింహంగారిచే ఆరాధన ధర్మోపన్యాసములు గావింపబడెను.

2-1-21 ఆదివారం—మధ్యాహ్నం 2 ఘం॥ నుండి అధ్యక్షురాలి ఆరంభోపన్యాసము. భక్తి విషయములగూర్చి బాలికల ప్రశ్నోత్తర మాలికలు. మెంబర్లలో కొందరి యుపన్యాసములు. అధ్యక్షురాలి అంత్యోపన్యాసము.

3-1-21 సోమవారము—మధ్యాహ్నం 2 ఘం॥నుండి 6 సం॥రంలు మొదలు 13 సం॥రంలు వయస్సుగల బాలికలచే సావిత్రినాటకము అతిమనోహరముగ ప్రదర్శింపబడెను.

4-1-21 మంగళవారము—మధ్యాహ్నం 2 ఘం॥నుండి భక్తాగ్రసరుండగు ప్రహ్లాదచరిత్రము హరికథారూపమున శ్రీయుత మహంకాళి రామబ్రహ్మదాసు గారిచే వినిపింపబడెను.

5-1-21 బుధవారము—ఈ యుత్సవ సందర్భమున చేయబడిన ఖర్చులనిమిత్తం శ్రీమతి గారపాటి వరలక్ష్మమ్మగారు పదిరూప్యముల విరాళము నొసంగుటయే గాక ప్రియప్రయాసల కోర్చి యీదినమున సమాజ మెంబర్లకును సమాజము మేలుగోరు తదితర నారీమణులకున్నూ (60 మందికి) వారి స్వంత మేడలో భక్ష్యములతోనున్నూ, వివిధ ఫలహారములతోనున్నూ, టీ పార్టీ చేసి సంతుష్టినొందించిరి.

దీనదయాళుండగు పరమేశ్వరుడీ సమాజమును దినదినాభివృద్ధి గాంచునటుల ఆశీర్వదించుగాక.

ఇట్లు,
మాదిరెడ్డి ఆండాళ్లమ్మ,
అరజా వెంకట లక్ష్మమ్మ.

---

## రాజమహేంద్రవర ప్రార్థన సమాజము.

బ్రాహ్మధర్మప్రచారకులగు శ్రీయుత డి. సి. దత్తుగారు మదరాసు నుండి కలకత్తాకు పోవుచు మాపట్టణమునకు 26 తేది ఉదయము విచ్చేసి నాటి సాయంకాలమే 5 గంటలకు ప్రార్థనమందిరములో ఇంగ్లీషున ఉపాసనయు, ధర్మోపన్యాసమును గావించిరి. మరునాటి దినమున సారంగధరునిగుట్టకు పోయిరి. 28, 29 తారీఖుల ఉదయము శ్రీ వీరేశలింగం పంతులుగారి ఆనందాశ్రమములో నున్న అనాథశరణాలయమున ప్రత్యేకోపాసనలు గావించి ఆనాడే కలకత్తాకు ప్రయాణమై వెడలిరి.

అందే వెంకటరామయ్య,
కార్యదర్శి.

---

VIRESALINGAM THEISTIC LIBRARY
NO..............

సత్యమేవజయతే

ధర్మసాధని

శనివారము, ౧౫, జనవరి, ౧౯౨౧.

# విద్యావిధాన సంస్కరణము.

:o:

ఇప్పటి విద్యాలయమున తలలనిండ అభిప్రాయములు చేరుచున్నవి; కాని హృదయములు గుల్లలైనవి, ఆత్మలు శుష్కించినవి. అభిప్రాయముల కేమి? అవి జీవనము యొక్క యుపరిభాగమున తేలియాడును. అలలవలె లేచుచుండును; పడుచుండును. అలలవలన ఏగొప్ప చలనము కలుగజాలదు. ఎక్కడి నీరు అక్కడనే లేచును, పడును. జలము ప్రవాహరూపము దాల్చెనేని, కోట్లకొలది మైళ్లు సంచారము చేయగలుగును. సముద్ర ప్రవాహములను గూర్చి వినియున్నాము. అవి ధృవములనుండి మధ్యరేఖకు అటు ఇటు వలయములుగా, సముద్రమున పైనను అడుగునను, నిరంతరము ప్రవహించుచు భూమిమీద నొక వైపుననున్న నీటిని ఇంకొక వైపునకు గొంపోవును గదా? మన జీవనములందు అట్టి మహావాహినులు గలవేమొ చూచుకొందుము గాక! ఈశ్వర సందర్శనముచే హృదయ ముప్పొంగి ఆత్మ ప్రఫుల్లమయి ప్రేమభక్తియా ప్రవాహములు వాని యంతటవి బయలుదేరి జీవనమును ప్రేమపూరితమును ధర్మసంభరితమును చేయును. మనకు దర్శనములేదు. కన్నులు లేనివాడు చేతులతో వస్తువులకై తడవుకొనినట్లు మనము వట్టి జ్ఞానముతో సత్యములకొరకు వెదకుదుము. మనకు సత్యములని చెప్పనవి సామాన్యముగ తర్కముచే నిరూపితములైనవి. మరియు మనకు వానియెడ గాఢానురక్తియు నుండదు. ఆత్మలకు సహజముగ దర్శించు శక్తిగలదు. దర్శనమునందు కొన్ని సమయముల కలుగు భ్రమను తొలగించుకొనుటకు మాత్రము జ్ఞానము తోడ్పడుచున్నది. దర్శనము వలన లభించిన విషయములను గురించియె జ్ఞానము వితర్కించును. తాను స్వయముగ క్రొత్త విషయముల కనుగొనజాలదు. దర్శనము లేకపోయిన తరువాత, కేవల జ్ఞానము చేయగలుగునది శూన్యమనియె చెప్పవచ్చును. మన విద్యావిధానము తార్కికశక్తిని కలిగించుచున్నదె గాని దర్శనశక్తిని పెంపొందించుట లేదు. తార్కికశక్తికి తోడుగ దర్శనశక్తియు వృద్ధినొందునట్లు మన విద్యావిధానము ముఖ్యముగ సంస్కరింపబడవలెను.

విద్యా విధానము సర్వాంగశిక్షకు సాధనముగ సంస్కరింపబడినచో, మనము పొందగలుగునది చంచలాభిప్రాయము గాక, సుదృఢ విశ్వాసము. విశ్వాసము జీవనమున పూర్తిగ అంతర్గతమగును, జీవనమును సంపూర్ణముగ మార్చివేయును. నవజీవనము పొడసూపును. విశ్వాసము మన జీవనములను పరివర్తనము నొందించుటయె గాదు. ప్రపంచమున అద్భుత మహాత్కార్యములను సాధించును. విశ్వాసమును గూర్చి భక్తాగ్రేసరుడు జీసస్,

"If ye have faith as a grain of mustard seed, Ye shall say unto this mountain, Remove hence to yonder place; and it shall remove; and nothing shall be impossible unto you."

అని చెప్పెను. ఆవగింజంత విశ్వాసముండిన చాలట. దాని కేదియు అసాధ్యము కాదట, భక్తుని అనుభవమిది. వినుచున్నాము, ఈమాటలు పలుమారు. మన జీవనములలో అట్టి శక్తి నేమైన గాంచుచున్నామా? ఆశక్తి ఏమాత్రము కలిగియుండక మన పాండిత్యమును గూర్చి గొప్పగా చెప్పుకొనుటకు అవకాశమెక్కడ? విశ్వాసమును ప్రసాదింపగల విద్యావిధానమె మనకు గావలయును. కొంత ద్రవ్యసంపాదనమునకు తోడ్పడుచున్నది గదా యని అంతటితో సంతోషించి యిప్పటి విద్యాపద్ధతిని సంస్కరించుటలో మన విద్యాధికులు అశ్రద్ధను జూపకుందురు గాక! విద్యా విధానము మార్పునొందిననె గాని మన దేశమున ధర్మజీవనము పెంపొందజాలదు. విద్యా విధాన సంస్కరణమునకు గడగు వారెల్లరు దేశీయుల కృతజ్ఞతకు, సాహాయ్యమునకు పాత్రులు. వారి ప్రయత్నములు ఫలించును గాక!

ఆంధ్రదేశమున విద్యా వ్యాపనము:—

దొరతనమువారు విద్యా వ్యాపనమునకు చేయు ప్రయత్నములు చాలకున్నవి. దేశమున విద్య త్వరితముగ విస్తరింపజేయుటకు దేశీయులు ప్రత్యేకముగ ప్రయత్నించుట కెంతయు అవకాశము గలదు. ప్రకృత విద్యావిధానమును సంస్కరించుటకు సలహాల నొసంగుటయె గాక తమ యభిప్రాయముల కనుగుణముగ విద్యాలయముల స్థాపించి వాని వృద్ధికై స్వార్థత్యాగముతో పాటుపడుటకు దేశీయు లుద్యుక్తులు గావలసియున్నారు. స్వయంకృషి నాధారపరచుకొని విద్యను వ్యాపింపజేయుటకు మన ఆంధ్రు లిటీవల జూపుచున్న యుత్సాహమునకు మా యామోదము తెలుపుచు వారి యుద్యమమునకు జయము గోరుచున్నాము. కృష్ణాపత్రిక మన జిల్లాలయందలి వివిధప్రయత్నముల ను గూర్చి యీక్రింది వృత్తాంతము ప్రచురించినది. ఈకార్య తత్పరత దినదినాభివృద్ధిజెంది స్థిరత వహించునుగాక!

"కృష్ణాజిల్లాలో తణుకుపంపును జగ్గయ్యపేట యందును ఇదివరకే జాతీయ విద్యాలయములు స్థాపింపబడినవి. నండూరు పార్థసారధి బి. ఎ, ఎల్. టి. గారు ప్రభుత్వపు విద్యాలయమును వదలి యిందులో పనిచేయుట కంగీకరించిరి. వీరుగాక మరి ముగ్గురు ఉపాధ్యాయులుగ జేరిరి. మొత్తముమీద ఇద్దరు యావజ్జీవసభ్యులుగ పని చేయుటకు నిశ్చయించుకొనిరి. ఏలూరు నందును బెజవాడయందును పెద్దమొత్తున జాతీయపాఠశాలలు స్థాపింపబడనైయున్నవి. తెనాలిలో గతమాసము ౫వ తేదీని జాతీయవిద్యాలయము స్థాపించిరి. గుంటూరు పట్టణమునందు ౧౬వ తేదీని జాతీయపాఠశాల ప్రారంభింపబడునని తెలియుచున్నది. రేపల్లె, ధూళిపూడి, బ్రాహ్మణకోడూరు గ్రామములలో విద్యాలయములు జాతీయ విద్యాలయములుగ మార్చుటకు ప్రయత్నములు సలుపబడుచున్నవి. తురిమెళ్ళనుండి సహాయ ప్రధానోపాధ్యాయులగు కొండిపర్తి వీరభద్రాచారిగారు తమ పదవికి రాజీనామా నిచ్చి జాతీయకళాశాలయందు చేర నిశ్చయించినారు. కావలి హైస్కూలులో రసాయన శాస్త్రోపాధ్యాయులగు ఎ. సత్యనారాయణ బి. ఎ. గారు ఉద్యోగమును నిరాకరించి ఆపాఠశాలనే జాతీయపాఠశాలగ మార్చినచో తక్కువ జీతమునకు పనిచేయు నటుల తెల్పియున్నారు. బందరు జాతీయకళాశాలలో ఉపాధ్యాయులగు చెరుకువాడ నరసింహముగారు ప్రత్యేకముగ జాతీయవిద్యా ప్రచారమునకై కృష్ణాజిల్లాలో తిరుగుచున్నారు."

# కిన్నరీ విజయము.

—:○:—

థామస్ మూర్ అను కవీశ్వరుడు ఆంగ్లమునందు రచించిన పద్యకావ్యమును 'కిన్నరీ విజయము' అను పేర పిఠాపుర వాస్తవ్యులు శ్రీ ఆదిపూడి సోమనాథరావుగారు పద్యరూపమున తెనిగించిరి. ఈకావ్యమందలి భావము మిక్కిలి యుత్కృష్టమై ధర్మజీవనమునకు అత్యంత సహకారిగా నున్నది.

కిన్నరులు స్వర్గమునుండి వారొనర్చిన యొకానొక యపచారముచే వెడలగొట్టబడిరనియు, వారిలో నొకతె స్వర్గద్వారము కడ నిలచి స్వర్గసౌఖ్యము గోల్పోయినందులకు విలపించుచుండ ద్వారపాలకుడు పరమేశ్వరునికి ప్రీతికరమైనది భూలోకమునుండి తెచ్చినచో ఆకిన్నరి స్వర్గములో ప్రవేశింప నర్హత బడయగలదని చెప్పెననియు, అంత కిన్నరి ప్రపంచమున సంచారముచేసి మొదట స్వదేశము కొరకు ప్రాణము విడిచిన శూరుని రక్తబిందువును, తరువాత ప్రియుని మరణము సహింపజాలక ఆతనితోడనె మృతి నొందిన ప్రియురాలి చివరి నిట్టూర్పును తీసికొనిపోవ, ద్వారపాలకుడు వాని కంటె శ్రేష్ఠతరమైన వస్తువు తెచ్చిననెగాని ప్రవేశము దొరకదని చెప్పగా, ఘోరపాప మొనర్పదలచి పశ్చాత్తప్తుడై ఆక్రూరకృత్యమునుండి మరలిన యొక పశ్చాత్తప్తుని కంటినుండి వెడలిన అశ్రుబిందువును తీసికొని వెళ్ళగన్ కిన్నరికి స్వర్గద్వారము తెరువబడెననియు ఆగ్రంథమునందు చక్కగ వర్ణింపబడెను. సోమనాథరావుగారు ప్రకటించిన పుస్తకమునందు వారి తెనుగు పద్యములెగాక మాతృకయు గలదు. గ్రంథమెల్లను చదువ తగినది. వెల రు 0-12 0 ప్రియతమమైన ఆ అశ్రుబిందువు ఇటుల వర్ణింపబడెను:—

అపుడుకిన్నరి విలపించు నతనిజూచి<br>
"గాఢముగ జొచ్చి హృదయమున్ గాల్చి కాల్చి<br>
వెలికి వచ్చిన పరితాప మొలుకునట్టి<br>
యశ్రుబిందువె ధన్యమై యలరుచుండు,<br>
పాపమోచన కరుణా ప్రవాహమైన<br>
దీనసేవాపి తొలుదొల్త మానసమున<br>
నిర్మలానంద రూపమున్ దెలియుచుండు;<br>
వేసవిని మండుచుండెడు వేడిగాలి<br>
నుండి "యీజిప్టు" మీద జనుదెంచు రాచ్చ<br>
నఖిల రోగ నివారిణి పాపహారి<br>
యైన యొకబిందువే యెట్లు లద్భుతముగ<br>
రోగముల మార్చి నిండు నారోగ్యమిచ్చి<br>
ధరకు దివికిని మరల జైతన్యమొసగు<br>
నట్టిలేమ గ్మ పంతాప మాత్మ గలుగ<br>
గాలు సుత్కృష్టమైన కన్నీరు గూడ?<br>
పతితుడా? చూడు నీమది బ్రబలియున్న<br>
పాపరోగము లెల్ల నేపాటివైన<br>
నొక్క దివిచుక్క యన్నింటి నుక్కడంచె"<br>
ననుచు దన డెందమున దానె యనుకొనియెను.

———

# లేఖలు.

—:౦:—

## శ్రీ వీరేశలింగ కవిసమాజము— కుముదవల్లి.

డిశంబరు ౩౧ వ తేదీని శ్రీ. కె. ఆర్. వి. కృష్ణారావు మందిరమున యీ సమాజముయొక్క ౨౩ వ వార్షికోత్సవ మహాసభ రాజమహేంద్రవరము వాస్తవ్యులగు శ్రీయుత పాలావఝ్ఝుల లక్ష్మీనారాయణ గారి యాజమాన్యమున జయప్రదముగా జరుపబడినది. ఈసభకు ఈపురవాస్తవ్యులే గాక ఇతరగ్రామాదులనుంచి కొందరు ప్రతినిధులువచ్చిరి. ఈశ్వరప్రార్థనతో సభ ప్రారంభింపబడినది. అగ్రాసనాధిపతిని యెన్నుకొనినతరువాత కార్యదర్శిచే యీసమాజవార్షిక నివేదిక చదువబడినది. దివాకర్ల తిరుపతిశాస్త్రిగారి యకాలమరణమువలన ఆంధ్రదేశమునకును భాషకును తీరనికొరత గలిగినందుకు దుఃఖించుచు, వారికుటుంబమునకును వారిసహచరులగు బ్రహ్మశ్రీ శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారికిని, మనహ్పూదయపూర్వక సానుభూతిని తెలుపుచు జ్ఞాపకార్థము వారి ఛాయాపటమును, యీసమాజమందిరమున యుంచుటకున్ను ఈ గ్రామకాపురస్థులున్ను, యీసమాజస్థాపకులలో నొకరును యీసమాజాభివృద్ధికై తమ జీవితకాలమున శక్తికొలది పాటుపడి స్వర్గస్థులైన భూపతిరాజు రామచంద్రరాజుగారి ఛాయాపటమును వారిజ్ఞాపకార్థము సమాజమందిరమున యుంచుటకున్ను శ్రీ కాళ్ళకూరి నరసింహముగారివలన నుపపాదింపబడి శ్రీ గుండు వెంకన్నగారివలన బలపరుపబడి అందరివలన నేకగ్రీవముగా నామోదింపబడినది. తరువాత గ్రంథాలయోపయోగములు" "పురాణ శ్రవణావశ్యకత" "ప్రస్తుతదేశ పరిస్థితులను బట్టి జాతీయవిద్యావ్యాప్తికొరకు కృషిసలుపుట" అను విషయములను గూర్చి కొందరుపన్యసించిరి. అగ్రాసనాధిపతిగారు పైవిషయములను గూర్చి మాట్లాడుచు ఆత్మవిశ్వాసము, ఆత్మగౌరవము, ధర్మనిరతి, ఈశ్వరధ్యానము, బలపడినకొలది సర్వదా జరుగుచుండెడి లోకపరిణామమువలన గలిగెడి సంఘర్షన కష్టములనన్నిటిని నిర్మూలించుటకు ఆత్మబలమే ముఖ్యసాధనమనియు ఆదర్శఫలప్రాప్తికి ఆకరమరనియు ప్రపంచమున ఆత్మబలమునకు మించినది వేరొకటిలేదనియు ఆత్మబలము యీశ్వర ప్రేరితమైనదనియు దానినరికట్టుటకు లోకమున నెవ్వరికి సాధ్యముకాదనియు మానవశక్తులను గుర్తెరిగి పరిణామస్థితి కనిపెట్టి నూతనయుగా దర్శములను కనిపెట్టి స్వాతంత్ర్యహక్కులను తప్పక కాపాడుకొనగల శక్తి విజృంభింపచేసికొనుట విధి అనియు, పెక్కు యుదహరణములతో విపులముగా ప్రసంగించిరి. ఈసభా సందర్భమున యీసమాజాభివృద్ధికి మూలధనముగా నుండుటకుగాను కీర్తిశేషులైన భూపతిరాజు సుబ్బరాజుగారి భార్య సత్తెయ్యమ్మగారు పంపించిన విరాళము రు ౨౫ అందుకొని ఆమెకుగల పరోపకార చింతకును, యుదారస్వభావమునకును యీసమాజమువారు మిగుల ఆనందించుచు ఆమెకు అనేక కృతజ్ఞతాభివందనములు అర్పించినటుల ఆమెకు విశదపర్చవలసినదిగా కార్యదర్శిగారిని కోరడమైనది. సమాజమువారు బీదలకు అన్నవస్త్రదానములుచేసిరి.

భూపతిరాజు తిరుపతిరాజు, కార్యదర్శి.

---

## శ్రీ రామమోహనరాయలు పుస్తకభాండాకారము.

ఈపురమున సర్వజనోపయోగార్థమై పైనామముతో నొక పుస్తకభాండాగారమును స్థాపించుటకుగాను మ॥ రా॥ రా॥ శ్రీ॥ కే, ధర్మారావునాయుడువారి యధ్యక్షతక్రింద డిశంబరు ౨౯ వ తేది సాయంకాలము ౬ గంటలకొక సభ జరుపబడెను. తత్సభకు పురవాసులుకొందరు విచ్చేసిరి. సభామందిరము జాతీయగీతములతోడను, మహాపురుషులపటములతోడను, బహుచక్కగా నలంకరింపబడెను. ఈసభయందు వి, జోసఫ్ గారు వార్తాపత్రికలు చదువుటవలన గలుగు ప్రయోజనములను గూర్చియు, వై నారాయణస్వామిగారు సంఘము బాగుపడుటెట్లు అను సమస్యను గూర్చియు నుపన్యసించిరి. తరువాత అగ్రాసనాధిపతిగారు రామమోహనరాయలవారి జీవితమును గురించియు, గ్రంథాలయోద్యమమును గురించియు అతిమధురశైలితో గంభీరముగా నుపన్యసించిరి. ఉపన్యాసానంతరమున కొందరు సభ్యులుగా చేరిరి. వి. జోసఫ్‌గారు సుదర్శని పత్రికను, బి. పి. చిట్టిగారు ఆంధ్రపత్రికను, సి. హెచ్. ధర్మాలావుగారు గోదావరిపత్రికను, బి. సహదేవగారు ధర్మసాధని పత్రికను, వై. నారాయణస్వామిగారు రవి, వివేకవతి పత్రికలను, జి. రాజారావుగారు కృష్ణాపత్రికను, వే. ధర్మారావునాయుడుగారు దివ్యజ్ఞానదీపికను (మాసపత్రిక), జె. బి. రావులుగారు ఒరియాపత్రికను (ఇంగ్లీషు) ఉచితముగా నొసంగుటకు వాగ్దత్తముచేసియున్నారు. ఈసంఘాభిమానులు సభ్యులుగా చేరుటయే గాక పైపత్రికలను పుస్తకభాండాగారమునకు ప్రసాదించినందులకు వారికనేక కృతజ్ఞతాభివందనములు.

సిరియామ్, బర్మా. బి. సహదేవ, కార్యదర్శి.

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*
*in*
**English & Telugu**
*Promptly and Neatly*
*executed.*

**CHEAPEST HOUSE**
**For School Books and Stationery etc.,**

# READY FOR SALE.

**S. S. L. C. Public Examination 1921.**

(1) Selections in English Prose & Poetry FOR DETAILED STUDY
Complete Book Price Rs. 0-10-0.
(2) S, S. L. C. Telugu Text Book For A. and C. Group. For Detailed Study
Price Rs. 1-0-0.

—::—

**S. S. L. C. Public Examination 1922.**

English Non-detailed Text Books. Anounced in advance to be used for V Form, in the Year 1920—21.
(1) Parables from Nature by Margaret Gatty. 0-12-0.
(2) Settlers in Canada by Captain Marryat. 0-11-0.

**T. P. VENKAYYA,**
**Book-Seller etc.,**
*COCANADA.*

# కేసరి—పత్రత్రయము.

## లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలను గలుగు ఋతుశూల, బహిష్టు కాకుండుట, ఆకాల బహిష్టు, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళ నొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీధర్మ వ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటక, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసన్ని జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,
ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**
*Sri Venkatesa Perumal koil Sannithy,*
TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,
శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజాపూరు.

13. సుగంధ పండ్లపొడి :—మంచి జీర్ణశక్తి యిచ్చును. పండ్లనొప్పి యేకాలమందు రాదు. పండ్లు యెప్పుడున్ను పడవు. సీసా 1 కి అణాలు 8, 1 టి మొదలు 5 సీసాలవరకు వి. పి. శెలవు అణాలు 7 ప్రత్యేకము.

14 స్ఖలితరక్షిణి :—బలహీనత వృష్ణము మొదలగు కారణములవల్ల నిద్రలోను, స్వప్నములోను నగు స్ఖలనము నిలిపి దేహసౌఖ్యమును యిచ్చును, బుడ్డి 1 కి వెల అణాలు 8, 1 టి మొదలు 6 బుడ్లవరకు వి. పి. శెలవు అణాలు 7 ప్రత్యేకము.

15. మేలైనకస్తూరి :—అది అద్భుతమైనది. కాశ్మీర్ దేశమునుండి రప్పింపబడినది. మావద్ద సదా దొరుకును. తులం 1 కి రూ. 48. చిల్లరలో 1 రూ తక్కువకు ఇవ్వబడదు, వి. పి. శెలవులు ప్రత్యేకము.

16. తేలుకుట్టుకుమందు :—ఈమందును కుట్టినచోట చరిమితే తక్షణమే విషమువిగి సహించలేని బాధను తొలగించును. అందరును ఆశ్చర్యపడి ఆనందము బొందుదురు. సీసా 1 కి అ. 4, వి. పి. శెలవు 1 మొదలు 12 సీసాల వరకు అణాలు 7 ప్రత్యేకము.

ఒకటేసారి 12 సీసాలకు తక్కువలేకుండ తేలుమందు కొనువారికి డజను ఒకటికి రూ. 2. అ, 8. చొప్పున యివ్వబడును. తేలుమందుకు మాత్రమే తప్ప యితరమందులకు ఈలాటి ఏర్పాటు యివ్వబడదు.

బొల్లికి మందు.

పైన వ్రాయవలసినది. ఒకవారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు, మెల్లగా పనిచేయును, అన్నితత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2-0-0. 1 మొదలు 3 సీసాల వరకు వి. పి. చార్జి 7 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

వెల స్వల్పము! సీసా ౧-కి 0=8=0 అణాలు మాత్రమే!! గుణమధికము!!!

పంచభాషను చూచికొనిన మోసము కలుగదు.

# అమృతాంజనము.

## అన్ని నొప్పులకు పరమౌషధము.

తలనొప్పుల మాన్పును, వాయువుపోట్ల బాపును, పార్శ్వపునొప్పుల బారదోలును, పోట్లను పోగొట్టును. ఇవి యని యననేల సకలవిధమైన నొప్పులకు సంజీవినివంటిది. వనమూలికలచే హిందూదేశమందు తయారు చేయబడు మంచి మందు. దీనిని విదేశములలోని అనేకులు వాడుచున్నారు. గొప్పగొప్ప వారిచే వేలకువేలు యోగ్యతాపత్రికలు పొంది యున్నది. అన్ని దుకాణములలోను చిక్కగలదు. ఒకసారి పరీక్షించి చూడుడు.

# లావుర తైలము.

తామర, తీట, ఏనుగగజ్జి, దురద, ఉంగరములవంటి చుట్లు, రసికారుట, వెంట్రుక లూడిపోవుట మొదలగు చర్మరోగములను నాశనము చేయగలదు. రాజారాణి బొమ్మను చూచికొనుట మంచిది. వెల ౦-౬-౦ లు మాత్రమే.

# మోహినీ తైలము.

స్త్రీ పురుషులు వాడుటకు యోగ్యమైనది. ౫ తులములు నూనెగల సీసా ౧కి క్రయం ౦-౧౨-౦.

# దంత చూర్ణము.

పంటినొప్పులకు దివ్యౌషధము; సువాసన గలిగియుండును. సర్వసామాన్యముగ వాడుటకు తగియున్నది.
డబ్బి ౧కి వెల ౦-౨-౦; ౨ కి రూ ౧-౨-౦ లు.

# అమృతాంజనము డిపో,

౧౦౯, ఫోర్ రోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మద్రాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

# ఆయుర్వేదాశ్రమము.

55, ఆచారప్పన్ వీధి. జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలుకీతిగా మందులు విక్రయింపబడును.
ప్లేగు, కలరా, ఇన్ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకు ను. తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

డి. మాధవస్వామిన్ (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము ‘ పండిట్ ’, మదరాసు. } డి. దేశికాచార్యులు, జాయింటు ప్రొప్రయిటర్లు.


# ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |


ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dhrma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


V. P. *Rs.* *As.* To M. R. Ry.




61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.